సాక్షి
వికారాబాద్
మంగళవారం । 10 । అక్టోబర్ । 2023



పురుగుల బియ్యం

అధికారుల నిర్లక్ష్యం కారణంగా రేషన్ దుకాణాలకు ముక్కిన, పురుగుల బియ్యం సరఫరా అవుతున్నాయి. 8లో ▸



మా డబ్బులు ఇప్పించండి

ఫేరల్స్ అగ్రోటిక్ కార్పొరేషన్ లిమిటెడ్ నుంచి కస్టమర్లకు డబ్బులు ఇప్పించాలని కంపెనీ ఖాతాదారులు కోరుతున్నారు. 8లో ▸



పనిచేసేవారికి ప్రాధాన్యత

బీఆర్ఎస్ పార్టీలో పని చేసేవారికి తగిన ప్రాధాన్యత ఉంటుందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. 9లో ▸

న్యూస్‌రీల్

నేడు దివ్యాంగుల జాబ్‌మేళా

బొంరాస్‌పేట: కమిట్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 10 విద్యావంతులైన దివ్యాంగుల కోసం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు మండల కో–ఆర్డినేటర్ చంద్రప్ప తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉండి పదో తరగతి నుంచి డిగ్రీ, పీజీ వరకు చదువుకున్న విద్యావంతులు అర్హులన్నారు. ఎంపికైన వారు హైదరాబాద్‌లో ఉద్యోగం చేయాల్సి ఉంటుందని, ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తారని తెలిపారు. వైకల్యాన్ని బట్టి ఉద్యోగ అవకాశం కల్పించనున్నామని చెప్పారు. వైకల్య ధ్రువీకరణ పత్రాలతో మండల కేంద్రంలో నిర్వహించే జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ 9553072833లో సంప్రదించాలన్నారు.

గొర్రెలెప్పుడిస్తారు సారూ..

- రెండో విడత ఆలస్యంపై ఆగ్రహం
- రోడ్డుపై బైఠాయించి నిరసన



కుల్కచర్ల ప్రధాన చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న గొల్లకుర్మలు

కుల్కచర్ల: రెండో విడత గొర్రెల పంపిణీలో ఆలస్యంపై మండలంలోని గొల్లకుర్మ సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ఆ సంఘాల ఆధ్వర్యంలో కుల్కచర్ల ప్రధాన చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు యాదయ్య మాట్లాడుతూ.. 6 నెలల క్రితం గొర్రెల యూనిట్ల కోసం డీడీలు కట్టామని, ఇప్పటి వరకు పంపిణీ చేయలేదని అన్నారు. దీంతో తెచ్చిన అప్పులకు వడ్డీ పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు కొందరికే అందుతున్నాయని ఆరోపించారు. పథకం అమలు చేయని నేపథ్యంలో గొర్రెలకు సమానంగా ఆర్థిక సహకారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆర్థికంగా ఇబ్బంది పడతామని పేర్కొన్నారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది రమేష్, వెంకటయ్యకు వినతిపత్రం అందజేశారు. వీరికి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, టీడీపీ రాష్ట్ర నాయకులు బాల ముకుందం మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాంచంద్రయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం

- జిల్లాలో 1,133 పోలింగ్ కేంద్రాలు
- ఎన్నికల నిర్వహణకు 8,800 మంది ఉద్యోగులు
- కొత్త పథకాలు ప్రకటించొద్దు, ప్రారంభోత్సవాలు చేయొద్దు
- కలెక్టర్ నారాయణరెడ్డి
- కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్: ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లపై ఎస్పీ కోటిరెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 1,133 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అవసరం మేరకు ఈవీఎంలు, ఈవీ ప్యాడ్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. 15 రోజుల్లో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. మహిళలు, దివ్యాంగుల కోసం నియోజకవర్గానికి ఐదు చొప్పున మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అంధులు ఓటు వేసేందుకు వీలుగా బ్రెయిలీ లిపితో కూడిన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా చూస్తామన్నారు. జిల్లాలో ఎన్నికల విధులకు 8,800 మంది ఉద్యోగులు అవసరం కాగా 9వేల మంది అందుబాటులో ఉన్నారని తెలిపారు. వారం రోజులు ముందే ఓటర్లకు పోల్ చీటీలు అందజేస్తామన్నారు. కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఎవరైనా కోడ్ ఉల్లంఘిస్తే 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయా లని సూచించారు. కొత్త పథకాలు, ప్రారంభోత్సవాలు చేయరాదని ఆదేశించారు. అయితే ఇప్పటికే ప్రారంభమైన పథకాలు, అభివృద్ధి పనులు యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు రాలేని వారి కోసం ఇంటి నుంచే ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఇందుకోసం నవంబర్ 8వ తేదీలోగా ఫారం 12డీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పార్టీల సమావేశాలు, ర్యాలీలకు కచ్చితంగా అనుమతి పొందాలన్నారు. ఓటు హక్కు పొందడానికి ఈ నెల 18వ తేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలో 18మంది నోడల్ అధికారులను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. 9.38 లక్షల మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. 45 వేల మంది కొత్త ఓటర్లు చేరారని వివరించారు.

నగదు తరలిస్తే చర్యలు: ఎస్పీ కోటిరెడ్డి

జిల్లాలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పోలీసు శాఖ అన్ని చర్యలు తీసుకుంటుందని ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. జిల్లా పరిధిలోని అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రూ. 50వేల కంటే ఎక్కువ నగదు తరలిస్తే, అందుకు సంబంధించిన పత్రాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. రూ. 10 లక్షల కంటే ఎక్కువ నగదు పట్టుబడితే ఆ మొత్తాన్ని ఐటీ శాఖకు అందజేస్తామని తెలిపారు. జిల్లాలో 293 మంది రౌడీ షీటర్లు ఉన్నారని, ఇప్పటికే 210 మందిని బైండోవర్ చేశామన్నారు. ఎన్నికలకు విఘాతం కలిగించే వారికి ఎట్టి పరిస్థితిల్లో ఉపేక్షించబోమన్నారు. జిల్లాలో 240 లైసెన్స్‌డ్ గన్‌లు ఉన్నాయని, 160 తుపాకులను డిపాజిట్ చేసుకున్నట్లు తెలిపారు. ఎన్నికల సామగ్రిని తరలించేందుకు రూట్ మ్యాప్‌లు తయారు చేస్తున్నట్లు వివరించారు. సోషల్ మీడియా, ఇతర ప్రచార మాధ్యమాల్లో రూమర్లను ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

మాట తప్పని పార్టీ కాంగ్రెస్

- అధికారంలోకి రాగానే ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ
- బీఆర్ఎస్ నమ్మకద్రోహుల పార్టీ
- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి
- యాలాలలో ఆత్మీయ సమ్మేళనం



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

యాలాల: కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చిందంటే కచ్చితంగా అమలు చేస్తుందని, ఇందులో ఎలాంటి సందేహాలకు తావు ఉండదని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం యాలాలలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో డీసీసీబీ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రజలను మభ్యపెట్టి నీళ్లు, నియామకాలు, నిధులను తుంగలో తొక్కారన్నారు. కేసీఆర్ కుటుంబ పాలనలో ప్రజలు విసిగిపోయారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 6 గ్యారంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. ప్రతి మండల కేంద్రంలో అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాలల నిర్మాణం, యువ వికాసం పేరిట పేద విద్యార్థుల ఉన్నత చదువులు అందుతాయని పేర్కొన్నారు. అనంతరం డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. తాండూరులో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి గెలిచాక కేసులు ఎక్కువ అయ్యాయని, అభివృద్ధి మాత్రం శూన్యమని ఆరోపించారు. రైతులకు తలనొప్పిగా మారిన ధరణిని రద్దు చేస్తామన్నారు. అధిష్టానం తాండూరు టికెట్ ఎవ్వరికి ఇచ్చినా గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల మాజీ అధ్యక్షుడు భీమప్ప, ఎంపీటీసీ మాణిక్యమ్మ, నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, వీరేశం, కలాల్ చంద్రశేఖర్, వడ్ల శ్రీనివాస్‌చారి, గంతల మైనొద్దీన్, ఖాసీం, రఘురాంరెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఆరీఫ్ పాల్గొన్నారు.



పెద్దేముల్: బుద్దారం బ్రిడ్జిని ప్రారంభిస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి

మళ్లీ మాదే అధికారం

- అభివృద్ధి, సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి
- మంత్రి మహేందర్‌రెడ్డి
- బుద్దారం, గాజీపూర్ గ్రామాల్లో వంతెనలు ప్రారంభం

పెద్దేముల్: అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను మళ్లీ గెలిపిస్తాయని మంత్రి మహేందర్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గాజీపూర్, బుద్దారం గ్రామాల్లో నిర్మించిన వంతెనలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచిందన్నారు. రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. అయితే గాజీపూర్ వంతెన వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకంలో ఆ గ్రామ సర్పంచ్ వీరప్ప పేరు లేక పోవడంతో ఆయన ఆర్అండ్‌బీ అధికారులపై మండిపడ్డారు. ఈ విషయాన్ని ఆ గ్రామ ప్రజలు మంత్రి మహేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన రెండు రోజుల్లో శిలాఫలకాన్ని మార్చి సర్పంచ్ పేరు ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. దీంతో సర్పంచ్, గ్రామస్తులు శాంతించారు. కార్యక్రమంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ నారాయణరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్, మండల వైస్ ఎంపీపీ మధులత, ఎంపీటీసీలు వెంకటేష్ చారి, అంబరయ్య, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు దాసరి నర్సింలు, మారేపల్లి, మంబాపూర్, మారేపల్లి తండా సర్పంచులు, శ్రావణ్ కుమార్, బలవంతురెడ్డి, పాండు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో ఆదర్శం

యాలాల: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని మంత్రి మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రాఘవాపూర్‌లో రూ.10 లక్షలతో నిర్మించిన డ్వాక్రా భవనాన్ని, రూ.86 లక్షలతో నిర్మించిన ముద్దాయిపేట బ్రిడ్జిని ప్రారంభించారు. రూ.2.68 కోట్లతో నాగారం – చెన్నారం రోడ్డు పనులకు, రూ.10.18 కోట్లతో బెన్నూరు సమీపంలో చెక్‌డ్యాం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

పౌర సేవలు మెరుగు

తాండూరు: బీఆర్ఎస్ పాలనలో పౌర సేవలు మెరుగు పడ్డాయని మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం తాండూరులో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. తాండూరు రైల్వే స్టేషన్‌లో నాందేడ్ – రయచూర్ ఎక్స్‌ప్రెస్ రైలును జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తాండూరు వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఈ నియోజకవర్గంలో రూ.1800 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. కేసీఆర్ హ్యాట్రిక్ సీఎంగా బాధ్యతలు చేపట్టడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న పరిమళ్, మున్సిపల్ కౌన్సిలర్లు, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభిస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి

మరోసారి ఆశీర్వదించండి

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి




తాండూరులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు: ప్రజల సహకారంతోనే తాండూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించానని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన పట్టణంలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో గ్రీనరీ పనులకు శంకుస్థాపన, 8వ వార్డులో డ్వాక్రా, అంగన్‌వాడీ భవనాల ప్రారంభోత్సవం, దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ చేశారు. 9వ వార్డులో డ్వాక్రా భవనం ప్రారంభోత్సవం, పాతకుంటలో కేసీఆర్ థీమ్ పార్క్ పనులకు శంకుస్థాపన, 19వ వార్డులో డ్వాక్రా, అంగన్‌వాడీ భవనాల ప్రారంభోత్సవం, 34వ వార్డులో అంగన్‌వాడీ భవనం ప్రారంభోత్సవం, 26వ వార్డులో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయా వార్డుల్లో ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సహాయ సహకారాలతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో తనను రెండో సారి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్, వైస్ చైర్‌పర్సన్ పట్లోళ్ల దీప, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వీణ, నగరేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ మురళీధర్, మున్సిపల్ కౌన్సిలర్లు రాఘవేందర్, సంగీత పాల్గొన్నారు.

హామీల అమలులో బీఆర్ఎస్ విఫలం

మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్



మహిళలతో మాట్లాడుతున్న ప్రసాద్‌కుమార్

మోమిన్‌పేట: ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆచరణ సాధ్యం కాని పథకాలను ప్రవేశపెట్టి ఆ తరువాత చేతులెత్తేసిందని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ ఆరోపించారు. రోజురోజుకూ బీఆర్ఎస్ గ్రాఫ్ పడిపోతోందని అన్నారు. సోమవారం మండలంలోని ఇజ్రాచిట్టంపల్లిలో నిర్వహించిన హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని మహిళలకు వివరించారు. మహిళలకు నెలకు రూ.2500 ఆర్థిక సహాయం, బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించనున్నట్లు తెలిపారు. రూ.2 లక్షల వరకు రుణమాఫీ, రైతు బంధు కింద ఎకరాకు రూ.15 వేలు ఇస్తామన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించారు. అంతకుముందు మక్తా తండా, మిత్యానాయక్ తండా, సోమ్లానాయక్ తండా, రాల్లగుడుపల్లి గ్రామాలకు చెందిన వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు బాగ్దాద్, శుభాష్‌గౌడ్, సురేందర్, మహేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, గిరి సింగ్, లక్ష్మారెడ్డి, వేమారెడ్డి, మాజీ ఎంపీపీ ఒగ్గు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రమాణాలు మెరుగుపడాలి

అనంతగిరి: వికారాబాద్ జిల్లాలో దిగజారిన విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని రౌండ్ టేబుల్ సమావేశం అభిప్రాయపడింది. సోమవారం వికారాబాద్‌లో తెలంగాణ సామాజిక కార్యకర్తల పరిరక్షణ, బాలల హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. నాణ్యమైన విద్య కోసం ఉద్యమించడం మన బాధ్యత అన్నారు. విద్యను అందించే గ్యారంటీ ప్రభుత్వం చట్టబద్ధత బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం, సీఆర్పీఎఫ్ జిల్లా ప్రతినిధి శివరాజ్, ఐఎఫ్‌టీయూ ప్రతినిధి గీత, టీఎస్ కేవీ ప్రతినిధి వెంకటేష్, పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రకాష్, ప్రతినిధులు శ్రీనివాస్, సతీష్ జనార్దన్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వైపు.. హన్మంత్‌రెడ్డి చూపు

అధికార పార్టీని వీడనున్న వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

ధారూరు: అధికార, ప్రతిపక్ష పార్టీల్లో అసంతృప్తిగా ఉన్న నాయకులు కండువాలు మార్చేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి తన అనుచరులు, మద్దతుదారులతో కలిసి ఈనెల 15న బీఆర్ఎస్‌నుంచి కాంగ్రెస్‌లో చేరనున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇన్నాళ్లు ఎమ్మెల్యే ఆనంద్‌కు వ్యతిరేకంగా పావులు కదుపుతూ వచ్చిన ఆయన హస్తం గూటికి చేరనున్నట్లు తెలుస్తోంది. గతంలో జరిగిన ఎన్నికల్లో ధారూరు మండలం నుంచి కాంగ్రెస్ అభ్యర్థికే ఎక్కువ ఓట్లు పోలయ్యాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ ఆశించిన మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేయడంతో ప్రసాద్‌కుమార్‌కు కొంత ఇబ్బందిగా మారింది. ఈసారి చంద్రశేఖర్ జహీరాబాద్ లేదా చేవెళ్ల నుంచి పోటీ చేసే అవకాశం ఉండటంతో గెలుపుపై ప్రసాద్‌కుమార్ ఆశలు పెంచుకున్నారు. ఇదిలా ఉండగా బీఆర్ఎస్ ఎంపీపీగా కొనసాగుతున్న విజయలక్ష్మి భర్త హన్మంత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరితే గులాబీ పార్టీకి నష్టం తప్పదనే చర్చ ఊపందుకుంది.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శోభారాణి



నియామక పత్రం అందజేస్తున్న శోభారాణి

మర్పల్లి: మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శోభారాణి అన్నారు. సోమవారం వికారాబాద్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మర్పల్లి కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలుగా సింగారి లక్ష్మిని నియమిస్తూ ఉత్తర్వుల కాపీని అందజేశారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల ప్రజలు ఆనందంగా జీవించాలంటే కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. పార్టీ మనుగడకు నిరంతరం పాటుపడాలన్నారు. ప్రతి గ్రామంలో మహిళా కాంగ్రెస్ కార్యవర్గాన్ని ఏర్పాటు చేసి వికారాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపుకోసం శ్రమించాలని ఆమె స్పష్టం చేశారు. తనకు పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు పదవీకి సహకరించిన మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్, రవీందర్, సీనియర్ నాయకురాలులక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

ఆవులను అపహరించిన దుండగులు

దోమ : పొలం దగ్గర కట్టేసిన ఆవులను అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించిన ఘటన దోమ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ రవిగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. దోమ మండల పరిధిలోని గొడుగోనిపల్లి గ్రామానికి చెందిన చెక్కల రాఘవేందర్, కుర్వ ఆంజనేయులు, శ్రీశైలం అనే రైతులకు చెందిన నాలుగు ఆవులను దుండగులు ఎత్తుకెళ్లారు. ఉదయం వెళ్లి చూడగా ఆవులు కనిపించపోవడంతో ఆందోళన చెందిన రైతులు.. పరిసర ప్రాంతాలు, చుట్టు పక్క పొలాల రైతుల దగ్గరకి వెళ్లి చూశారు. కనిపించకపోవడంతో సోమ వారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒక్కొక్క ఆవు విలువ రూ. 80 వేలు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు

షాద్‌నగర్‌రూరల్: బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలయిన ఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెలిజర్ల గ్రామ శివారులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. కేశంపేట మండలం కోనాయపల్లి గ్రామానికి చెందిన సురేష్‌గౌడ్ పని నిమిత్తం ద్విచక్రవాహనంపై షాద్‌నగర్‌కు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో వెలిజర్ల శివారులోని బాలాజీ పరిశ్రమ సమీపంలో వెళ్తుండగా బైక్ అదుపు కిందపడడంతో సురేష్‌గౌడ్ తలకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సురేష్‌గౌడ్‌ను చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఉస్మానియాకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పురుగుల బియ్యం మాకొద్దు

- గుండాల రేషన్ దుకాణానికి ముక్కిన, పురుగుల బియ్యం సరఫరా
- అధికారులకు ఫిర్యాదు చేసినా మారని తీరు
- దుకాణం ఎదుట లబ్ధిదారులు ఆందోళన



రేషన్ దుకాణం వద్ద ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు



గుండాల రేషన్ దుకాణానికి సరఫరా అయిన పురుగులు, తుట్టెలు పట్టిన బియ్యం

దోమ: అధికారుల నిర్లక్ష్యం కారణంగా రేషన్ దుకాణాలకు ముక్కిన, పురుగుల బియ్యం సరఫరా అవుతున్నాయి. రేషన్ బియ్యం పంపిణీలో అధికారులు నాణ్యత పరిశీలించడం లేదని లబ్దిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం దోమ మండలంలోని గుండాల గ్రామానికి గొడౌన్ నుంచి రేషన్ బియ్యం వచ్చాయి. ఆ బియ్యం పురుగులు, తుట్టెలు పట్టడంతో నాసిరకంగా ఉన్నాయని, ఈ బియ్యం మాకొద్దంటూ గ్రామస్తులు రేషన్ దుకాణం ఎదుట బైఠాయించి నిరసనకు దిగారు. గతంలో పలుమార్లు ఇలాంటి బియ్యానే సరఫరా చేశారని, మళ్లీ అదే పని చేస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపించారు.

నాణ్యతకు తిలోదకాలు!

గత కొన్ని నెలలుగా గుండాల గ్రామానికి పురుగులు, ముక్కిన బియ్యం సరఫరా చేస్తున్నారని లబ్దిదారులు ఆరోపిస్తున్నారు. తినడానికి చాలా ఇబ్బందిగా ఉందని మంచి బియ్యం ఇవ్వాలని పలుమార్లు పౌరసరఫరాల అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ బియ్యం మాకొద్దంటూ డీలర్‌ను నిలదీస్తే ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని వాపోతున్నారు.

అధికారుల తీరుపై విమర్శలు!

రేషన్ దుకాణాలకు పంపించే ముందు క్వాలిటీ కంట్రోల్ అధికారులు బియ్యాన్ని పరిశీలించి, బియ్యం బాగున్నాయా లేదాని చూసుకోని గ్రామాలకు సరఫరా చేయాలి. కానీ, అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తూ, నాణ్యతను గాలికి వదిలేసి, బియ్యం క్వాలిటీ చెక్ చేయకుండానే సరఫరా చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

నాణ్యత లేని బియ్యం సరఫరా



ముక్కిన, తుట్టెలు పట్టిన బియ్యాన్ని సరఫరా చేయడం ద్వారా గ్రామస్తులు తినలేని పరిస్థితి ఏర్పడింది. గత మూడు నెలల క్రితం ఇలాంటి బియ్యాన్నే సరఫరా చేశారు. మళ్లీ అవే బియ్యం సరఫరా చేస్తున్నారు. సంబంధిత అధికారులు నాణ్యతలు పాటించేలా చర్యలు తీసుకోవాలి.

–గోవర్ధన్, గుండాల

మా డబ్బులు ఇప్పించండి

వికారాబాద్ అర్బన్: పేరల్స్ అగ్రోటిక్ కార్పొరేషన్ లిమిటెడ్ నుంచి కష్టమర్లకు డబ్బులు ఇప్పించి ఆదుకోవాలని పేరల్స్ కంపెనీ ఖాతాదారులు సోమవారం జిల్లా ట్రైనీ కలెక్టర్ నారాయణ్ అమిత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2014లోనే సీబీఐ సంబంధిత కంపెనీపై సుప్రీంకోర్టులో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. 2016లో సుప్రీంకోర్టు ఆర్ఎం లోధ కమిటీ వేసినట్లు చెప్పారు. సంబంధిత కంపెనీ ఆస్తులు అమ్మి కస్టమర్లకు డబ్బులు చెల్లించాలని లోధ కమిటీ తీర్పుచ్చినట్లు వివరించారు. 9 సంవత్సరాలు అవుతున్నా నేటికి కస్టమర్లకు డబ్బులు అందలేదని వాపోయారు. జిల్లాలో వేల మంది కస్టమర్లు ఉన్నారని పేర్కొన్నారు. కంపెనీ మోసం చేయడంతో కస్టమర్లు ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నట్లు వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొని కస్టమర్లకు సకాలంలో డబ్బులు అందేలా చూడాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కస్టమర్లు రాములు, ధన్‌రాజ్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.



ట్రైనీ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న పేరల్స్ కస్టమర్లు

రైతులకు అందుబాటులో గోదాం

డీసీసీబీ సీఈఓ లక్ష్మయ్య

దౌల్తాబాద్: రైతుల ప్రయోజన కోసం రూపొందించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన గోదాంను సోమవారం జిల్లా కోఆపరేటివ్ సీఈఓ లక్ష్మయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాబార్డు సహకారంతో మండల కేంద్రంలో 1.87కోట్లతో గోదాం నిర్మించామని తెలిపారు. ఇందులో 2500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల మెగా గోదాం నిర్మించి రైతులకు అందుబాటులో తెచ్చామన్నారు. గోదాం నిర్మించినందుకు సహకార సంఘం చైర్మన్, సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో కో–ఆపరేటివ్ అధికారులు అనంతయ్య, సిబ్బంది తదితరులున్నారు.



గోదాంను ప్రారంభిస్తున్న డీసీసీబీ సీఈఓ

చందన బ్రదర్స్ ప్రారంభం

వికారాబాద్‌లో సందడి చేసిన అను ఇమాన్యుయల్

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన చందన బ్రదర్స్ షాపింగ్ మాల్‌ను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ప్రముఖ సినీ నటి అను ఇమాన్యుయల్ రిబ్బన్ కత్తిరించి షోరూమ్‌లోకి వెళ్లారు. అనంతరం పట్టుచీరలు, వస్త్రాలను తిలకిస్తూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, పట్టణ ప్రముఖులు తదితరులు ఉన్నారు.



మాల్‌ను ప్రారంభిస్తున్న అను ఇమాన్యుయల్

ఇద్దరు దొంగలకు రిమాండ్

కొడంగల్ రూరల్ : ఓ మహిళలను బెదిరించి మెడలోని ఆభరణాలను ఎత్తుకెళ్లిన ఇద్దరు దుండగులను సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. సీఐ రాములు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని రావులపల్లికి చెందిన కుర్వ లక్ష్మమ్మ ఈ నెల 5వ తేదీన ఉ.10గంటల ప్రాంతంలో గ్రామ శివారులో మేకలను మేపుతోంది. ఆమె గమనించిన ఇద్దరు దొంగలు మహిళను బెదిరించి మెడలోని నల్లపూసల దండ, చెవి కమ్మలు, వెండి కడియాలు, వెండి చైన్‌లను తీసుకెళ్లారు. సోమవారం ఉదయం రావులపల్లి చెక్‌పోస్టు దగ్గర పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లోని మల్లాపూర్‌కు చెందిన సంపంగి చిన్న అలియాస్ కృష్ణ, రాజేంద్రనగర్‌కు చెందిన వర్ష శ్రీనుగా గుర్తించి దొంగిలించిన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఎస్ఐ గోపాల్, హెడ్ కానిస్టేబుల్ శివరాములుగౌడ్, పోలీసు సిబ్బంది కృష్ణ, నరేందర్‌రెడ్డిలను సీఐ రాములు అభినందించారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాములు

జైపూర్ రైలుకు షాద్‌నగర్ స్టాప్



జైపూర్ రైలుకు స్వాగతం పలుకుతున్న అధికారులు

హర్షం వ్యక్తం చేసిన ప్రయాణికులు

షాద్‌నగర్‌రూరల్: రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వేశాఖ ఉన్నతాధికారులు జైపూర్ రైలుకు సోమవారం నుంచి షాద్‌నగర్ రైల్వే స్టేషన్‌లో స్టాప్ పాయింట్‌ను ఇచ్చారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్‌లో డీఆర్‌యూసీసీ సభ్యులు డాక్టర్ చంద్రశేఖర్, దిడ్డిగోపాల్ ఆధ్వర్యంలో జైపూర్ రైలుకు ప్రయాణికులు ఘన స్వాగతం పలికారు. రైల్వే సిబ్బందికి స్వీట్లు పంచి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. షాద్‌నగర్ ప్రాంతంలో అన్ని రాష్ట్రాల ప్రజలు ఉండటంతో మినీ ఇండియాగా పిలవబడుతుందని అన్నారు. జైపూర్ రైలును షాద్‌నగర్‌లో నిలపడంతో ఇతర రాష్ట్రాలకు వెళ్లే రైల్వే ప్రయాణికులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. ఇతర ప్రాంతాలకు వెళ్లానుకునేవారు గతంలో హైదరాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితి. ప్రస్తుతం జైపూర్ రైలును ఆపడంతో ప్రయాణికులు ఇక్కడినుండే వెళ్లవచ్చని చెప్పారు. జైపూర్ రైలును షాద్‌నగర్‌లో నిలిపేందుకు అవకాశం కల్పించినందుకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ, రైల్వే సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలను తెలియజేశారు. స్వాగతం పలికిన వారిలో రాజస్థాన్ అసోసియేషన్ సంఘ్ అధ్యక్షుడు కై లాష్‌సింగ్‌చౌదరి, సభ్యులు రాధేశ్యాం, కమల్‌కిషోర్‌శర్మ, శంకర్‌లాహోటి, పవన్‌కుమార్, బీజేపీ గోసేవ కమిటీ సభ్యుడు మల్లేష్, వెటర్నరీ శివశంకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు బాలిక

మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు

ఇబ్రహీంపట్నం: బాలిక మిస్సింగ్ అయిన ఘటన ఆదివారం ఇబ్రహీంపట్నంలో చోటు చేసుకుంది. ఫిర్యాదు చేసిన ఐదారుగంటలలోపే పోలీసులు కేసును ఛేదించి బాలికను కుటుంబసభ్యులకు అప్పగించారు. ఎస్ఐ మైబెల్లి తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నంలోని గాంధీనగర్‌లో నివాసముండే బాలిక(14) స్థానిక ప్రభుత్వ గర్ల్స్ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతోంది. శనివారం పాఠశాలకు వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. దీంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు స్నేహితులను, బంధువుల వద్ద వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలో దిగిన ప్రత్యేక పోలీసుల బృందం ఆమె స్నేహితులను, పాఠశాల ఉపాధ్యాయులను, చుట్టు పక్కల వారిని, సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఈ నేపథ్యంలో కాగజ్‌ఘాట్‌లోని తొటి స్నేహితురాలి ఇంటికి వెళ్తున్నానని తనతో అన్నట్లు మరో బాలిక పోలీసులకు తెలిపింది. దీంతో ఆ గ్రామానికి పోలీసులు వెళ్లి వివరాలు సేకరించగా ఆమె క్లాస్‌మెంట్ ఇంట్లోనే ఉన్నట్లు గుర్తించారు. వెంటనే బాలికను తల్లిదండ్రులకు అప్పగించడంతో కథ సుఖాంతమయ్యింది. బాలికకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. కుటుంబసభ్యులు పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

అనంతగిరి: జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ మంత్రి ప్రసాద్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం కాంగ్రెస్ నాయకులు వికారాబాద్ మండలం పులుమద్దిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రసాద్‌కుమార్ ముఖ్యఅతిథి హాజరై మాట్లాడారు. కార్యకర్తలు, నాయకులు పార్టీకి తగిన సమయం కేటాయించాలన్నారు. కాంగ్రెస్ చెప్పిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత నాయకులదేనని సూచించారు. గ్రామ గ్రామాన పర్యటించి ప్రజలను జాగురత చేయాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, ఎంపీపీ చంద్రకళ, జిల్లా నాయకులు కిషన్‌నాయక్, రామచంద్రారెడ్డి, అనంత్ రెడ్డి, కమాల్ రెడ్డి , ఎర్రవల్లి జాఫర్, సుధాకర్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, వేమారెడ్డి, నర్సింలు, లక్ష్మణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్

'బతుకమ్మ'ను విజయవంతం చేద్దాం

కొడంగల్ రూరల్: ఈ నెల 18న నిర్వహించే బహుజన బతుకమ్మ వేడుకలను విజయవంతం చేయాలని ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎరన్‌పల్లి శ్రీనివాస్, డాక్టర్ వెంకటేశ్వర్లు, కార్యనిర్వహణ కమిటీ అధ్యక్షుడు రేగడిమైలారం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో పలు సంఘాల నాయకులతో కలిసి వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఇందులో రజక సంఘం మండల అధ్యక్షుడు అశోక్, శేఖర్, నాగప్ప, విజయ్, అంబేడ్కర్ సంఘం నాయకులు హనుమంతు, వెంకటయ్య, బసవరాజ్ ఉన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా న్యామతాపూర్‌లో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవనానికి భూమిపూజ చేశారు. అలాగే, రావిచేడ్‌లో రూ.2.20 కోట్లతో నిర్మించిన రావిచేడ్–మద్దెలకుంట తండా బీటీరోడ్డు, రూ.20 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం న్యామతాపూర్‌లో బతుకమ్మ చీరల పంపిణీతో పాటు, చల్లంపల్లి గ్రామానికి చెందిన లబ్దిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి పెద్దపీట చేస్తుందన్నారు. ప్రభుత్వం చేపట్టిన పాలమూరు –రంగారెడ్డి ప్రాజెక్టుతో కల్వకుర్తి నియోజకవర్గం సస్యశ్యామలమవుతుందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీని మరోసారి ఆశీర్వాదించాలని కోరారు. అనంతరం ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, వైస్‌ఎంపీపీ ఆనంద్, సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహరెడ్డి, రవీందర్ రెడ్డి, కృష్ణయ్య, ఎంపీటీసీ గోపాల్, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, ఉప సర్పంచ్ వెంకటేశ్, నాయకులు బాలకృష్ణ, పవన్, బాలకృష్ణ, మల్లేశయాదవ్, కన్ననాయక్,రంగయ్య ఉన్నారు.



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

పాడిరైతులకు ప్రభుత్వం చేయూత

కడ్తాల్: పాడి రైతులకు ప్రభుత్వం వివిధ పథకాలతో ఆదుకునేందుకు కృషి చేస్తోందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువుల పెంపకందారులు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పశవులకు డాక్టర్ భానునాయక్ ఆధ్వర్యంలో పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, వైస్‌ఎంపీపీ ఆనంద్, సర్పంచ్ లక్ష్మీనర్సింహరెడ్డి, ఉప సర్పంచ్ రామకృష్ణ, మార్కెట్ డైరెక్టర్ లాయక్‌అలీ, నాయకులు వీరయ్య, మల్లేశ్ ఉన్నారు.

వాహన తనిఖీలు షురూ

- అక్రమంగా నగదు, మద్యం తరలిస్తే కఠిన చర్యలు
- షాద్‌నగర్ పరిధిలో మూడు చెక్ పోస్టుల ఏర్పాటు
- ఏసీపీ రంగస్వామి



షాద్‌నగర్: రాయికల్ టోల్ ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

షాద్‌నగర్: అక్రమంగా నగదు, మద్యం, తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఏసీపీ రంగస్వామి హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో షాద్‌నగర్ నియోజకవర్గం పరిధిలో మూడు చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. సోమవారం రాయికల్ పరిధిలోని టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద పోలీసులు విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ దృష్ట్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నియోజకవర్గం పరిధిలోని చౌదరిగూడ, కడ్తాల్, రాయికల్ టోల్ ప్లాజాల వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాహనాల్లో అక్రమంగా నగదు, నగలు, మద్యం రవాణా చేయడం నేరమని చెప్పారు. రూ.50వేలకు మించి నగదును తీసుకెళ్తితే సీజ్ చేస్తామన్నారు. నగదు, నగలకు సంబంధించిన ధ్రువపత్రాలను విధిగా తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. తనిఖీల్లో పట్టణ సీఐ ప్రతాప్‌లింగం, ఎస్ఐ దేవకి, తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్‌లో..

అబ్దుల్లాపూర్‌మెట్: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీని ప్రారంభించారు. సోమవారం సాయంత్రం విజయవాడ జాతీయ రహదారిపై అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ మన్మోహన్, ఎస్ఐ కరుణాకర్‌రెడ్డిలు తమ సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేపట్టారు.

కొందుర్గులో..

కొందుర్గు: ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో జిల్లేడ్ చౌదరిగూడ మండలం లాల్‌పహాడ్ చౌరస్తాలో ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీలు మొదలుపెట్టారు. లాల్‌పహాడ్ అటు వికారాబాద్, ఇటు రంగారెడ్డి జిల్లాలకు శివారు ప్రాంతం కావడంతో పోలీసు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. ఆధారాలు లేకుండా డబ్బులు తరలిస్తే సీజ్ చేయడం జరుగుతుందని, డబ్బులు, మద్యం తరలించడంపై దృష్టి పెట్టినట్లు ఎస్ఐ సక్రమ్ తెలిపారు.



కొందురు: లాల్‌పహాడ్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు



అబ్దుల్లాపూర్‌మెట్‌లో..

నిందితుడికి జీవిత ఖైదు

షాద్‌నగర్‌రూరల్: మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి కోర్టు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు షాద్‌నగర్ పట్టణ సీఐ ప్రతాప్‌లింగం తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని భీమారం గ్రామానికి చెందిన పూజారి పాండు అనే వ్యక్తి 2018లో మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు తెలిపారు. ఈ మేరకు నిందితుడిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు చెప్పారు. కేసు విచారణ చేపట్టిన షాద్‌నగర్ కోర్టు జడ్జి సోమవారం నిందితుడు పూజారి పాండుకు జీవిత ఖైదుతో పాటుగా రూ.32వేల జరిమానా విధించినట్లు తెలిపారు. బాధితురాలికి పదిలక్షల పరిహారం చెల్లించాలని తీర్పు ఇచ్చినట్లు సీఐ తెలిపారు.



పూజారి పాండు